# కందుకూరి వీరేశలింగం తో



మధురవాణి నెత్తిన పాగా, చీరమీద కోటు తొడుక్కుని శాలువా కప్పుకుంటుంది. వీరేశలింగం తలకు ఎర్రపాగా చుట్టుకుంటూ వుంటారు. పంతులుగారు యథాప్రకారం యమబిజీ.

**మధుర:** వకీలు సౌజన్యారావు పంతులుగారు తమకీ ఉత్తరం యిప్పించారండీ.

**వీరేశలింగం:** విశాఖపట్నం నుంచి వచ్చావన్నమాట. అప్పారావు పంతులుగారు బావున్నారా? (ఉత్తరం జూచును).

**మధుర:** మీరు నిశ్చయంగా మహాపురుషులని మా గురువుగారి నమ్మకం

**వీరేశ:** నువ్వేమనుకుంటున్నావ్?

**మధుర:** తెలుగువారికి ప్రాతఃస్మరణీయుల . కన్యాశుల్కం రెండవ ముద్రణకు పీఠిక రాస్తూ అప్పారావు పంతులుగారు-తరతమ స్థాయిలో స్వచ్ఛమైన వాడుకభాషలో, ఇంగ్లీషు ప్రదర్శన నాటకాల అనుసరణలనూ, భారతీయ జీవితాన్ని చిత్రించే ప్రహసనాలనూ భిన్నభిన్న స్థాయిల వాడుకభాషా శైలిలో తన సంకలిత రచనల ప్రథమ సంపుటిగా వెలువరించి, రావ్ బహద్దూర్ వీరేశలింగం పంతులుగారు, బహుశా తనకు తెలియకనే, తెలుగుభాషకు గొప్ప సేవచేశారు వీటి ఎంపిక ఆయన నిశిత లోకజ్ఞానానికి తార్కాణం. ఎందువల్లనంటే ఆ ప్రథమ సంపుటిలో ఆయన అత్యుత్తమ రచనలున్నాయి పాఠక లోకాన్ని వుప్పెనలా వూపివేసిన ఆయన రచనలు నిజానికి ఇవే - నన్నారు

**వీరేశ:** నారచనలన్నీ నా ఉద్యమానికి సహాయకారులు. సంఘంకోసం సంఘం మంచికోసం ఉద్దేశించినవి

**మధుర:** కత్తిలా పదునైనవి కూడా

**వీరేశ:** ఇంతకీ నువ్వెవరు? నాతో నీకేంపని.

**మధుర:** నే నెవ్వరైతేనేమి? మీ మంచి పనులచేత ఆకర్షింపబడి వచ్చాను నేను మీతో కొంతసేపు ముచ్చటించవచ్చునా?

**వీరేశ:** నాకుశత్రువులధికం. అందుచేత మారువేషంలో వచ్చిన మాయావికాదు గదా అని అనుమానం

**మధుర:** ఇది (నెత్తిన వున్న పాగా తీసి జుత్తును జారవిడిచి, వెనుకకు తిరిగి తొడుగుకున్న కోటు విడచి, కప్పుకున్న శాలువా వలెవాటుగా వేసుకొని వీరేశలింగం పంతులుగారి వైపు తిరిగి) నా వూరూ, పేరూ అడిగితిరి. వూరు విజయనగరం, పేరు మధురవాణి.

**వీరేశ:** ఎంతమోసము? నేను యాంటీ నాచ్ అని తెలియదా?

**మధుర:** ఆమ్రపాలిది మా వంశమే. వసంతసేన మా అప్పగారు. ఇంగ్లండులో ఫ్రాన్సిస్ థాంప్సన్ అనే కవి రోజు ఒక పద్యం రాసి తనకు ఆశ్రయమిచ్చిన వేశ్య దిండుకింద వుంచేవాడట. హవుండ్ ఆఫ్ హెవెన్ (స్వర్గభైరవం) అనే పద్యం అటువంటిదే. భగవంతుడు మనిషి వెంట పడతాడు. అదీ విశేషం.

**వీరేశ:** ఆపాపు. నీకేం కావాలి?

**మధుర:** ఇటీవల మీకీర్తి శరీరాన్ని తూటులు పొడిచేమాటలు వింటున్నాం. అవి భరింపలేక ఒకసారిమీతో ముఖతా మాట్లాడి తృప్తి చెందుదామని.

**వీరేశ:** ఏమంటారు? నాకు గ్రంథచౌర్యం అంటకట్టారా? నాపై వ్యభిచారనేరం ఆరోపించారా? నీచబుద్ధి గల వాండ్లయందు యితరుల మేలును నైపుణ్యతయును అసూయను పుట్టించును. ఘనమైన బుద్ధికలవారు అసూయత లేకనే ఒకరికంటెను తామతిశయించుటకు క్రమము మీరక ప్రయత్నపడియెదరు. **(Among the base merit begets envy, among the noble emulation).**

**మధుర:** మీరు యుగపురుషులు మహాపురుషులు కానే కాదట.

**వీరేశ:** అలా అని నేను చెప్పుకున్నానా? ఇతరులు అంటే దానికి నేను ఉత్తరవాది నెలా అవుతాను? నేను గతించిన 70 ఏళ్ళకు ఈనాడు కొందరు అల్పులు నీచాతినీచంగా సంపుటాలమీద సంపుటాలు ప్రచురిస్తున్నారు నిందలతో నామీద. నేను సంఘసంస్కరణోద్యమం చేపట్టిన కొత్తలో నన్ను రాళ్ళతో కొట్టారు. కోర్టులంట తిప్పారు. చంపించడానికెన్నో ప్రయత్నాలు చేశారు. ఇవేం కొత్తకాదు.

**మధుర:** మీరు మీ ఇల్లాలు రాజ్యలక్ష్మమ్మగారు పోయాక యూరోపియన్‌ల వలె విలాసజీవితం గడిపారని వేమన భక్తులొకరు అంటున్నారు. ఇంకా యీర్ష్యాళువులైనవారు యిలా వ్యాఖ్యానించారు. 'కాని సంఘసంస్కరణ పంతులుగారి సంపాదనకు ఉపకరించక పోలేదు. వారి రచనలు లాభించాయి. ధనవంతులయ్యారు. జట్కాబండి, గొడ్డుమాంసం పెట్టి పెంచే గండుకుక్క, ఎక్కడెక్కడినుంచో తెప్పించి నాటిన నానా ఫలపుష్ప జాతుల చెట్లు నిండినతోట, వేసవి శీతావాసాలు, దంపతుల సాయంకాల విహారాలు, మూడు నగరాల్లో భవంతులు అంతా యూరోపియన్ శైలిజీవితం అమర్చుకోగలిగారు దక్షిణభారత విద్యాసాగరులు.

**వీరేశ:** నాది అప్పుడు చాలా దయనీయస్థితి. జుట్టు అట్టలు కట్టింది. తలంటుపోసే వారులేరు. వృద్ధాప్యంలో వేళకింత భోజనం పెట్టేవారు లేరు. అన్నానికి పోషణకు నానా అగచాట్లు పడ్డాను. పైగా చిన్నప్పటినుంచీ తోడుగా ఊపిరి సలపనివ్వని దగ్గు. నా కాలం వాళ్ళంతా చెల్లాచెదరయ్యారు. ఆనాటి విద్యార్థులు యువకులు లేరు. అప్పుడు నా శత్రువులు విజృంభించారు.

**మధుర:** మీ హయాంలో నిర్మించిన పురమందిర పఠనమందిరం నుంచి మిమ్మల్ని బహిష్కారానికి గురిచేయాలన్న తీర్మానం ఘోరంగా వీగిపోలేదా? ఇదంతా ఎందువల్ల?

**వీరేశ:** అప్పటికి నావంట్లో జవసత్వాలుడిగిపోయినాయి. నా విరోధులేమో వయసులో వున్నారు. కాలం మారిపోయింది. నన్ను ఎలాగైనా బాధించాలని, లొంగదీయాలని, యశోహాని కలిగించాలని శీల నిర్మూలన ప్రమాదం కలిగించాలని నా విరోధుల కృతనిశ్చయం. భార్య పోయాక తరుచు అనారోగ్యానికి గురయ్యాను. ఒకసారి స్మారకం తప్పింది. ప్రాణం పోయిందనుకున్నారు గాని ఎలానో తేరుకున్నాను. నా వయస్సు 62 సంవత్సరాలు. అప్పుడు వచ్చింది మంగమ్మ కేసు.

**మధుర:** మంగమ్మ కేసేవిటి?

**వీరేశ:** 'మానవసేవ' అనే తనపత్రికలో నాళం కృష్ణారావు నాగురించి అనుచితమైన అపాత్రపు వ్రాతలు వ్రాశాడు. తరువాత క్షమాపణ చెప్పుకుని రాజీపడ్డాడు. కాని అవే రాతలను టంగుటూరి శ్రీరాములు ఇంగ్లీషులోకి అనువదించి తన కార్లీలియన్ పత్రికలో అచ్చువేశాడు. నేను కోర్టులో దావా చేశాను. బార్న్‌వెల్ అనే న్యాయాధికారి ముద్దాయిలు దండనార్హులని నిర్ణయించి ఛార్జిచేశాడు. నాళం కృష్ణారావుకి జ్ఞానోదయమైంది కాని శ్రీరాములుకి కాలేదు అతను ముక్కోపి, దురాగ్రహావేశపూరితుడు.

**మధుర:** టంగుటూరి ప్రకాశం పంతులుగారి తమ్ముడికి మీతో విరోధం దేనికి?

**వీరేశ:** చిలకమర్తివారి 'దేశమాత' పత్రికలో శ్రీరాములుగారిపై వ్యంగ్య విమర్శ రాయగా ఆయన కోర్టుకెక్కారు. ఆ కేసు కొట్టుకుపోయింది. ఆ అక్కసు మనసులో పెట్టుకుని కార్లీలియన్ పత్రికలో అవాకులు చవాకులు అన్నీ తమకు తెలిసినవికావు, నాళం కృష్ణారావుగారు 'మానవసేవ'లో వ్రాసినవే ప్రకటించాడు. అప్పుడు నేను వారిపై కేసు తగిలించాను.

**మధుర:** మంగమ్మ గొడవ ఏవిటో చెప్పారు కారు.

**వీరేశ:** ప్రకాశంగారి పుణ్యమా అని శ్రీరాములుగారు జైలు కెళ్ళడం తప్పింది. మంగమ్మ ఎవరనా, అడిగావు. భార్య గతించాక నాదగ్గర వుండి అన్నం వండి పెట్టి నా పోషణ చూసేది. మత్సరగ్రస్తులు అసూయాపరులు అన్నమాటలకు ఆమె మనసు ఎంత గాయపడిందో పాపం కడుపుతోవున్న మంగమ్మ కనకుండానే కాలం చేసింది.

**మధుర:** సరోజినీ నాయుడు వివాహం మీ జీవిత చరిత్రలో ప్రస్తావించలేదని విమర్శకులు తప్పు పడుతున్నారు. ఎందువల్ల.

**వీరేశ:** ఆ వివాహం నా పెద్దరికంలో నేను జరిపించినట్లు నా జీవితచరిత్రలో రాశానే! సరిగా చూసివుండరు.

**మధుర:** బ్రాహ్మణేతర మిత్రులతో కలసి భోజనం చేశారా ఎప్పుడన్నా?

**వీరేశ:** అదో గొప్ప సంగతికాదు. ఎన్నోసార్లు భోజనం చేశా. యజ్ఞోపవీతం కూడా తీసేశాను. బ్రహ్మసమాజ పద్ధతిలో మా అమ్మకు నాన్నకు తద్దినాలు పెట్టాను.

**మధుర:** మీరు వేమనకు సరిరారని అంటున్నారు కొందరు ఆంధ్రులు.

**వీరేశ:** నేను నేనే. వేమనకి నాకు పోలికేవిటి? నాన్సెన్సు.

**మధుర:** ఆడమళయాళం అంటే ఏమిటి?

**వీరేశ:** నేను సత్యరాజా పూర్వదేశ యాత్రలు అనే పుస్తకం వ్రాసి అందులో ఆడవాళ్ళరాజ్యంలో మగవారు విధేయులుగా ఉండడం చమత్కారంగా రాశాను. నిజంగా అటువంటి రాజ్యం కేరళలో వుందనుకున్నారు మనవాళ్ళు.

**మధుర:** సుబ్రహ్మణ్య భారతికూడా మిమ్మల్ని వ్యంగ్యంగా చిత్రించి ఎక్కిరించారని ఒకరు అంటున్నారు. నిజమా?

**వీరేశ:** చంద్రిక అనే కథలో మా దంపతుల్ని చేర్చి చిత్రించాడు సుబ్రహ్మణ్య భారతిగారు. జి.సుబ్రహ్మణ్య అయ్యరుద్వారా కలుసుకున్నాం. సంఘసంస్కరణోద్యమం, వితంతు వివాహాలపట్ల జరుగుతున్న కృషికి ఆదరాభిమానాలు వ్యక్తం చేశాడు. ఆ నాటికి యిటువంటి వితంతు వివాహాలు దక్షిణాదిన జరగ గలవని వూహించడానికి కూడా ఆస్కారం లేదు. అతని కెందుకుంటుంది హేళనా భావం? వీరేశలింగం పంతులు వీట్టిల్ విరుందు అనికాబోలు రాశాడు.

**మధుర:** మిమ్మల్ని కమ్యూనిస్టులు ఆకాశానికెత్తి 'కామ్రేడ్ వీరేశలింగం' చేశారని కొందరికి దుగ్ధ కొక్కొండ వెంకటరత్నం పంతులుగారి వంటి పిచ్చిపండితుడొకడు దొరకడంవల్ల మీ ప్రతిభ ప్రకాశించిందట (నవ్వు).

**వీరేశ:** (నవ్వి) బ్రాహ్మణులు నన్ను ద్వేషించేవారు కొందరు నువ్వు చెప్పిందానిని బట్టి బ్రాహ్మణేతరులు కూడా నన్ను ద్వేషించడం ప్రారంభించారన్నమాట యిప్పుడు ఆంధ్రదేశం కులపిచ్చితో ఎంత కలుషితమైపోయింది?

**మధుర:** సామినేని ముద్దు నరసింహం నాయుడుగారి 'హితసూచని' చూశారా. ఆయన మొదట వ్యావహారిక భాషావాది అంటున్నారు అవునా?

**వీరేశ:** ఆరోజుల్లో వున్న భాషే అది గ్రాంథిక భాషా ఉద్యమం లేనప్పుడువ్యావహారిక భాషా ఉద్యమం అనేది వుండదు. జనులు వ్యవహరించే భాష అది. నాయుడు గారి 'హితసూచని' చూశా. బందరులో 'పురుషార్థ ప్రదాయిని' అంతకుముందు 'తత్వబోధిని' అని కొన్నాళ్ళు వచ్చి ఆగిపోయిన పత్రిక ఎన్నో విషయాల్ని చర్చించాయి. చదవటం రాయటం వేరు; ఆచరణలోకి తీసుకు రావటం వేరు. 'వృత్తాంతిని' పత్రికలో 1840 నాటికే సాంఘిక సమస్యలు వాటి పరిష్కారాల ప్రస్తావన వుంది వుండటం వేరు, చేసి చూపించడం వేరు

**మధుర:** వారు లేకపోతే వీరికి జ్ఞానోదయం కాదని నిర్ధారించడం విమర్శకుల తప్పు నేను పుట్టకపోతే ఎవర్ని పెళ్ళి చేసుకునేవారు అని అడిగినట్లుంది.

**వీరేశ:** నాకాలంలోని సాంఘిక సమస్యలకు వేమన కాలంలోని సాంఘిక సమస్యలకు పోలిక ఎక్కడ?

**మధుర:** మీకు రావుబహద్దూర్ బిరుదు రావడంతో అహంకారం పెరిగిందట. మీ శిష్యులు అంటున్నారు.

**వీరేశ:** ఆ మాత్రం అహంభావం స్వచ్ఛంద చారిత్యము లేకపోతే నన్ను నిలువు లోతువ అణచిపారేసేవారు. పాము బుసకొట్టాలి కరవకపోయినా.

**మధుర:** మీరు మెట్రిక్యులేషన్ ప్యాస్ కాలేదటగదా.

**వీరేశ:** ఎవడా కూసింది?

**మధుర:** లియోనార్డ్ అనే పరిశోధకుడు; తెలుగు సరిగా రానివాడు (నవ్వు)

**వీరేశ:** నేను మా అమ్మ పోలిక. ఆవిడ పట్టుదల, దయ, కోపం అన్నీ నాకు సంక్రమించాయి.

**మధుర:** ప్రకాశం పంతులుగారు నెగ్గించిన యేలూరి లక్ష్మీనరసింహంగారి కేసేవిటి?

**వీరేశ:** ఈ యేలూరి లక్ష్మీనరసింహం, తండ్రిలేని, ఇంకా కాపురానికైనా వెళ్ళని నవ వధువుమీద దుశ్చింతతో, హేయమైన దుర్మార్గ ప్రవర్తనతో పరమ క్రూరంగా, నీచాతినీచంగా, ఆపిల్ల మగడ్ని తనకు వశం చేసుకొని, ఆయింటిమీద రాళ్ళు వేయించాడు. అటువంటి నీచుడ్ని ప్రకాశం పంతులుగారు తప్పించాడు ఆయన పార్టీవాడు కనుక. ఇతను కొద్దిరోజులు నా శిష్యుడు కర్మకాలి.

**మధుర:** మరి ఆత్మూరి నరసింహంగారు మీకు గురువా?

**వీరేశ:** కొద్దికాలం నాకు గురువు. ఈయనది బందరు. కొన్నాళ్లు ఉపాధ్యాయులుగా పనిచేశారు. తరవాత ప్లీడరైనారు. 'దంభాచార్య ప్రహసనం' అనే ప్రహసనం వీరిమీదే రాసింది. వితంతు పునర్వివాహ నిధి విషయంలో పైడా రామకృష్ణయ్యగారు మరణించగా ఆ నిధి ఏమైందో కూడా తెలీకుండా పాడు చేశారు. ఈయన బ్రహ్మ సమాజం నుంచి వైష్ణవంలోకి మారాడు. ఇక నువ్వు వూహించుకో.

**మధుర:** మీకు జాతీయావేశం లేదనీ, బ్రిటిష్ భక్తులనీ నిందిస్తారు. దీనికేమంటారు?

**వీరేశ:** 1914దాకా ఇండియన్ నేషనల్ కాంగ్రెసువారు బ్రిటిష్ ప్రభువుల పట్ల విధేయ విశ్వాసభక్తి ప్రకటనలు చేసేవారు కాదా? అప్పటిదాకా జాతికి స్వతంత్ర పతాకం లేదే? అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్‌ల ఆత్మ బలిదానాన్ని భారతజాతీయ కాంగ్రెస్‌వారు తీర్మానరూపంగా కూడా సంతాపం వెల్లడించలేకపోయారు. సంఘసంస్కరణం ముందూ దేశ స్వాతంత్ర్యోద్యమం తరువాతా అని నమ్మాను.

**మధుర:** మీకు స్పర్థ ఎక్కువంటారు మీ శత్రువులు.

**వీరేశ** : స్పర్థ లేకపోతే విద్యకాదుగదా ఏదీ రాణించదు.

**మధుర** : అమెరికన్ పరిశోధకుడు లియోనార్డు మీమీద కొంత బురద చల్లిపోయాడు.

**వీరేశ:** ఆ బురదలో యింకా కొన్ని తిరుగుతున్నాయి. అసలు నన్నడిగితే సామినేని వారిని వేమనను యిలాంటివారిని అడ్డం పెట్టుకుని కులద్వేషం చిమ్ముతున్నారేమోనని అనుకుంటాను. ఏది ఏమైనా నాకాలంలో కొన్ని అనర్థాలుంటే అవిపోయి కొన్ని కొత్త అనర్థాలు యిప్పుడు పుట్టుకొచ్చాయి.

**మధుర:** మీరు బ్రాహ్మణ సంఘం మీదే విరుచుకుపడ్డారని బ్రాహ్మణ సంఘసంస్కర్త మాత్రమేనని మరోవాదన.

**వీరేశ:** రోగం ఎక్కడ అధికంగా వుంటే అక్కడ చికిత్స. నాదృష్టిలో మొత్తం సమాజం వుంది.

**మధుర:** మీరు మన పురాణాలను నీతిశాస్త్రాలను తీవ్రంగా ఆక్షేపించారట గదా!

**వీరేశ:** అది దుష్ప్రచారం. అయితే పారదారికమైన శృంగారాన్ని (తారాశశాంకం వంటివి) తీవ్రంగా గర్హించాను. అశ్లీల గ్రంథాలను తిట్టినమాట నిజమే.

**మధుర:** మీరు మనవాళ్లని తెగడి పైవాళ్ళని అంటే బ్రిటిష్ వారిని మెచ్చుకున్నారని అభియోగం ఏమంటారు?

**వీరేశ:** 'మన దేహమున బుట్టిన వ్రణమని మనకది సుఖమియ్యదు. అరణ్యమున బుట్టిన చెట్టని మందు వ్యాధిని బోగొట్టి సుఖమియ్యక మానదు. సత్యమెక్కడి దైననూ సుఖప్రదమును గ్రాహ్యమునేయగును' అని వివేక వర్ధనిలో వ్రాశాను 1913లో. 'మన పూర్వులు బుద్ధిహీను లనియు మనలో నేదియు మంచిది లేదనియు మాయభిప్రాయమెంత మాత్రము కాదు'.

**మధుర:** మీమీద అభియోగం ఏమంటే - 'మన వేదశాస్త్ర పురాణేతిహాసములందలి ఉత్తమ ధర్మములను వివరించి మన పూర్వనాగరికతలోని విశేషములను వర్ణించి, ఉత్తమాదర్శములను చిత్రించి పూర్వులవలె సాహసౌదార్యములను, సద్గుణములను అలవరచుకొని అభివృద్ధి చెందవలెనను భావము కలిగించలేదు' అని.

**వీరేశ:** నాతరవాత వచ్చిన విశ్వనాథ సత్యనారాయణ ఆపని చేశాడు కదా (నవ్వు)

**మధుర:** విగ్రహారాధనను నిరసించడం, హేతువాదులు కావాలనడం, స్వతఃప్రమాణమే తనకిష్టమనడం, బ్రాహ్మణాచారాలను భావాలను విశ్వాసాలను విమర్శించడం కొందరికి నచ్చలేదు.

**వీరేశ:** బెంగాలు చరిత్ర వేరు. మహారాష్ట్ర చరిత్రవేరు. నాకాలంనాటి ఆంధ్రదేశం వేరు. బ్రహ్మ సమాజం తగ్గాక దివ్యజ్ఞాన సమాజం, అనిబిసెంటు, గాంధీగారు, రామభజన, అన్నీ వచ్చాయి కదా. నా పని అంత వరకే. చారిత్రిక నేపథ్యం నుంచీ స్థితిగతుల నుంచీ సంఘటనలను విడగొట్టి చూడకూడదు. నన్నుకూడా.

**మధుర:** ఈశ్వరభక్తి యుక్తుని క్షితీశ్వరమాన్య పరోపకారితా
శాశ్వత కీర్తి కామముఖ శత్రు విజేత వివేకవర్ధనా
ధీశ్వ సనోపకారమతి రాయబహద్దరు కందుకూరివీ
రేశ్వరమంత్రి పుంగవు స్మరించిమదిం గొనియాడ జెల్లదే!

★

*('మిసిమి' నవంబర్ 1991)*